

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

బుధవారం 28 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 147 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ – సంక్షేమమే మా ధ్యేయం

పీఎం శ్రీ జిల్లాస్థాయి ఆర్ట్ అండ్ కల్చర్ పోటీలు ఘనంగా నిర్వహణ



● **సూర్యాపేట** అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాస్థాయి పీఎం శ్రీ ఆర్ట్ అండ్ కల్చర్ పోటీలు స్థానిక బాలభవన్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 31 పీఎం శ్రీ పాఠశాలల నుంచి ఆర్ట్, మ్యూజిక్, డాన్స్, క్రాఫ్ట్ విభాగాల్లో పాఠశాలస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో ఒక్కో కేటగిరీకి ఒక్కో విద్యార్థి చొప్పున మొత్తం 131 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) సిహెచ్. శ్రీనివాసరావు, క్వాలిటీ కోఆర్డినేటర్ ఈ. హరికృష్ణ, బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి హాజరయ్యారు. జ్యూరీ సభ్యులుగా వి. వెంకటేశ్వర్లు, వి. శ్రవణ్ కుమార్, ఆర్. నాగరాణి, ఎం. కవిత, డి. ఎల్లయ్య, ఎం. సాయి చరణ్, కే. సత్యనారాయణ సింగ్, ఎన్. ఉమారాణి వ్యవహరించారు. అలాగే ఎఫ్ఎల్ఎన్ సెల్ సభ్యులు సిహెచ్. నాగరాజు, ఎస్. బ్రహ్మం, సిహెచ్. శ్రీనివాస్, విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో డ్రాయింగ్ విభాగంలో టీజీఎంఎస్ ఆత్మకూర్‌కు చెందిన పి. సుమన, సంగీతం విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కోదాడకు చెందిన పి. అక్షయ్, డాన్స్ విభాగంలో జెడ్పీహెచ్ఎస్ సూర్యాపేటకు చెందిన బి. పూజ, క్రాఫ్ట్ విభాగంలో జెడ్పీహెచ్ఎస్ సూర్యాపేటకు చెందిన బి. సాత్విక్ విజేతలుగా నిలిచారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.



తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు 550కి పైగా దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు,డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మక సదస్సు.. అక్టోబర్ 29న ఢిల్లీలో కర్టెన్ రైజర్

హైదరాబాద్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ-గ్లోబల్ సమ్మిట్-2026'కు 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఈ సదస్సు ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, సమ్మిట్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో భాగంగా అక్టోబర్ 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానుండగా, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తుందని వివరించారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో సమ్మిట్‌పై రోడ్‌షోలు నిర్వహించామని, ప్రధాన సదస్సుకు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ గ్లోబల్ సమ్మిట్‌లో నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పాలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ఈ రంగాలకు చెందిన సుమారు 100 కంపెనీలు, సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా సంస్థలకు ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పంపామని, ఆహ్వాన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ జరిగే ప్రధాన వేదికను 25 సెక్టార్లుగా విభజించి, ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, కంపెనీల ప్రదర్శనలకు అవసరమైన సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, సమావేశాల నిర్వహణతో పాటు అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతలు నిర్వహించేందుకు సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమ్మిట్ విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ఏర్పాట్లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట

జనగణనలో తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలి

జనగణనకు ప్రజలు సరైన సమాచారం అందించి ఎన్యూమరేటర్లకు సహకరించాలి



సూర్యాపేట, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, ఛార్జ్ అధికారులు (తహసీల్దార్లు), అదనపు ఛార్జ్ అధికారులు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు)కు జనగణనపై రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన రెండో దశకు సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు, అధికారుల బాధ్యతలను వివరించారు. 2027 జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన రెండో దశ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) జనవరి 10 నుంచి 24 వరకు, ఇంటింటి జనగణన జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని, ఫిబ్రవరి 28న రాత్రి ఇళ్లు లేని వారి గణన చేపడతామని వివరించారు. అనంతరం మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి గృహ యజమానిని సంప్రదించి మొత్తం 40 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని, ప్రజలు సరైన సమాచారాన్ని అందించి ఎన్యూమరేటర్లకు సహకరించాలని కలెక్టర్ కోరారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జనగణన ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సీపీఓ కిషన్, జడ్పీ సీఈవో శిరీష, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు

పనితీరులో మార్పు రాకపోతే అధికారులపై కఠిన చర్యలు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సంగారెడ్డి, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలు, ముఖ్యంగా రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పనితీరులో మార్పు రాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో కలిసి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ-సర్వే చేపడుతోందన్నారు. భూ సర్వే పురోగతిపై తహసీల్దార్లు, సర్వేయర్లను నేరుగా వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి.. కేటాయించిన గ్రామాలు, పూర్తయిన సర్వే, రోజువారీగా సర్వే చేస్తున్న భూమి విస్తీర్ణం, సర్వే పూర్తి చేసేందుకు పడుతున్న సమయం తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో ప్రతి రైతుకు తన భూమి విస్తీర్ణం, సరిహద్దులపై స్పష్టత కల్పించాలని, ఎలాంటి సందేహాలు లేకుండా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తెలియజేయాలని ఆదేశించారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటించి సర్వే పనుల పురోగతితో పాటు రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా, రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ-సర్వేను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ-సర్వే కొనసాగుతోందని, ఆయా గ్రామాల్లో జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు విస్తృతంగా పర్యటించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేసే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు సూచనలు చేశారు. సమావేశంలో సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, ఎంపీలు రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, నంజీవరెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితమైతేనే పంటలకు మంచి ధర,రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



హైదరాబాద్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రైతులు సంఘటితంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారా పనిచేస్తే పంటలకు మెరుగైన ధరలు పొందడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ తెలిపింది. రైతు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐఏఎస్ తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' 112వ ఎపిసోడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతు సంఘాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, పథకాల లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి అధికారులు ఈ సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఎఫ్‌పీఓలు, ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రాలను అద్దెకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కేంద్రాల్లో భూమి అభివృద్ధి, విత్తనం, నాటడం, అంతరకృషి, సస్యరక్షణ, కోత, నూర్పిడి, పంట కోత అనంతర పనులు, పంట అవశేషాల నిర్వహణకు సంబంధించిన ఏడు విభాగాల్లో 37 రకాల యంత్రాలు అందుబాటులో ఉంటాయని అధికారులు వివరించారు. పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, విత్తన-ఎరువు డ్రిల్లర్లు, పవర్ స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్లు, కంబైన్ హార్వెస్టర్లు, పనుపు బాయిలర్లు, పాలిషర్లు, స్ట్రా బేలర్లు వంటి యంత్రాల ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు, సమయం తగ్గడంతో పాటు సంఘాలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, క్షేత్రస్థాయి చర్యలు, 'ఖేత్ బచావో అభియాన్' ద్వారా నేల సంరక్షణపై కూడా అవగాహన కల్పించారు. రైతులకు అదనపు ఆదాయం అందించే మార్గాలపై చర్చిస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లోని కోహీర్ మండలంలో సాగు చేస్తున్న గెర్కిన్స్ పంటను విదేశాలకు ఎగుమతి చేసే విధానం, యాదాద్రి భువనగిరి జిల్లాలో మునగ ఆకులతో పొడి తయారు చేసి ఎగుమతి చేస్తున్న విధానాలను సంబంధిత కంపెనీల ప్రతినిధులు వివరించారు. పంటల సాగు నుంచి విలువ జోడింపు, మార్కెటింగ్, ఎగుమతుల వరకు రైతు సంఘాలు సమష్టిగా పనిచేస్తే మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రబీ సీజన్‌లో పంటల ఎంపిక విషయంలో రైతులు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలని, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు అనుకూలమైన సమయాన్ని గుర్తించి విత్తుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. కుసుమ, శనగ, పెసర, మినుము వంటి పంటలను నీటి లభ్యతకు అనుగుణంగా ఎంచుకోవాలని, పంట పూత, కాయ నిండే దశల్లో అవసరమైన నీరు అందించాలని, సిఫారసు చేసిన విత్తన రకాలను అధికారిక డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని పేర్కొంది. రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలు, యాంత్రీకరణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి కోరారు.



చౌటకూర్‌లో వేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

చౌటకూర్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం చౌటకూర్ గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద నిర్మిస్తున్న మరుగుదొడ్లకు స్లాబ్ పనులు చేపట్టారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్కల రామ్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రామాగౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరకల రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, బాలు, వార్డు సభ్యులు బాలు, గోదేమియా తదితరులు పాల్గొన్నారు.

బాలికను మాయమాటలతో తీసుకెళ్లిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు



మెదక్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: బాలికను మాయమాటలతో నమ్మించి వెంట తీసుకెళ్లిన కేసులో నిందితుడు ఆనంద్ (22)కు మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించింది. 2025 అక్టోబర్ 14న హాస్టల్‌కు వెళ్తున్న ఎనిమిదో తరగతి బాలిక బస్సు మార్గం తప్పడంతో చేగుంటలో దిగింది. ఈ క్రమంలో తనకు పరిచయమున్న ఆనంద్‌కు ఫోన్ చేయగా, అతడు మాయమాటలు చెప్పి బాలికను మేడ్చల్, నిజామాబాద్, సికింద్రాబాద్ మీదుగా తీసుకెళ్లినట్లు కేసులో పేర్కొన్నారు. మరుసటి రోజు తూప్రాన్ పోలీసులు బాలికను గుర్తించి భరోసా కేంద్రానికి తరలించారు. ఘటనపై తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసును దర్యాప్తు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. ప్రాసిక్యూషన్ వాదనలు, బాలిక ఇచ్చిన సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు దర్యాప్తులో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు



నర్సాపూర్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. హేమలత హెచ్చరించారు. ‘సురక్షిత్ బచ్పన్ అభియాన్’లో భాగంగా జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి హేమలత మాట్లాడుతూ బాలల హక్కులు, భద్రత, రక్షణ, సంక్షేమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి బాలుడు, బాలిక భయం లేకుండా సురక్షిత వాతావరణంలో జీవిస్తూ విద్యను అభ్యసించడంతో పాటు తమ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు కలిగి ఉంటారని తెలిపారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని, నేరస్తులకు కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణ, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, వాటి ప్రాముఖ్యతతో పాటు అవసరమైన వారికి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. బాలల భద్రత కేవలం తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాలల హక్కులను గౌరవిస్తూ సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉంటూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశంలో చెత్తను కాల్చిన దుకాణ యజమానికి జరిమానా

నారాయణఖేడ్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో బహిరంగ ప్రదేశంలో చెత్తను కాల్చిన దుకాణ యజమానికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి ఆదేశాల మేరకు మంగళవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశంలో చెత్తను కాల్చుతున్న దుకాణ యజమానిని గుర్తించి జరిమానా విధించడంతో పాటు రసీదును అందజేశారు. పట్టణంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాల్చకుండా మున్సిపల్ సిబ్బంది సూచించిన విధానంలోనే పారవేయాలని అధికారులు కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని, నారాయణఖేడ్ పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



నర్సాపూర్‌లో ఎరువుల దుకాణాల తనిఖీ.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

నర్సాపూర్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా అంతర్గత స్క్వాడ్ ఆధ్వర్యంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అమీనా బీ, మండల వ్యవసాయ అధికారిణి దీపిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల విక్రయదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్సులు కలిగి ఉండాలని, నాణ్యమైన ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని అధికారులు సూచించారు. స్టాక్ రిజిస్టర్లను రోజువారీగా నవీకరించడంతోపాటు ఎరువుల నిల్వలు, విక్రయాలకు సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖకు ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. రైతులకు ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు.

ప్రేమ పేరుతో వివాహితకు టోకరా.. 18 తులాల బంగారం, రూ.50 వేల నగదు కాజేసినట్లు ఆరోపణలు



జోగిపేట, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రేమ పేరుతో ఓ వివాహితను నమ్మించి 18 తులాల బంగారం, రూ.50 వేల నగదు తీసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు ప్రకారం, రాముగౌడ్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో తనను నమ్మించి బంగారం, నగదు తీసుకున్నట్లు ఆరోపించారు. తన వద్ద తీసుకున్న బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బులను ఖర్చు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దసరా పండుగ సమయంలో బంగారం విషయం వెలుగులోకి రావడంతో తన నగలు, నగదు తిరిగి ఇవ్వాలని కోరగా, వాటిని ఇచ్చేందుకు నిరాకరించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించారు. తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, బంగారం, నగదు తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ లక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. ఈ ఘటనలో వచ్చిన ఆరోపణలపై పోలీసుల విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్.. విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన

నర్సాపూర్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నర్సాపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సుమారు 400 నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నర్సాపూర్ సీఐ రంగ కృష్ణ, ఎస్‌హెచ్‌ఓ ఎ. రంజిత్ కుమార్, ఆర్ఎస్ఐ భవానీ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్రను వివరించారు. ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖలో వినియోగించే ఆయుధాలు, వివిధ పరికరాలు, దర్యాప్తు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేసి, వాటి వినియోగం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చట్టాలను గౌరవించాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థుల్లో పోలీస్ శాఖపై అవగాహన పెంపొందించడం, చట్టాల పట్ల గౌరవాన్ని పెంచడం, వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థులు పోలీస్ శాఖకు సహకరించి సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.



చిన్నారుల రక్షణకు పోక్సో చట్టం ఎంతో కీలకం: జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్

అందోల్ (జోగిపేట), అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఉర్-రెహమాన్, న్యాయవాదులు సారా వెంకటేశం, షానవాజ్ అలీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అభద్రతకు గురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. చిన్నారుల రక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, మానసిక ధైర్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి న్యాయ అవగాహన సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందోల్–జోగిపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు.. పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు: మంత్రి పొంగులేటి



సంగారెడ్డి, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతుల భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు తమ పనితీరులో మార్పు తీసుకురావాలని, భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించి రైతులకు భూమి విస్తీర్ణం, సరిహద్దులపై స్పష్టత కల్పించాలని ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి భూ సర్వే పురోగతిని పరిశీలించారు. తహసీల్దార్ల నుంచి కలెక్టర్ల వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, భూ సమస్యల పరిష్కారం కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని సూచించారు. వ్యవసాయ భూములు, ఆబాదీ ఆస్తుల రీ సర్వేను 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే కొనసాగుతోందని పేర్కొన్నారు. భూ సర్వే ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్హులైన పేదలకు విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, లబ్ధిదారులకు సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి, వాటి కేటాయింపులను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రతి భూ యజమానికి 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య.. పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఉపగ్రహ చిత్రాలతో భూ పటాలు: మంత్రి పొంగులేటి

సంగారెడ్డి, అక్టోబర్ 28(సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక భూ రికార్డుల నిర్వహణ లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి భూ సర్వే, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, తాగునీటి సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో భూ రికార్డుల నిర్వహణలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ భూ పరిపాలనలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఈ చట్టం అమలులో భాగంగా తొలి విడతలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సర్వేను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేసి భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులపై స్పష్టత తీసుకురావాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. ఇప్పటికే ఏడు ఉమ్మడి జిల్లాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎనిమిదో సమావేశం చేపట్టినట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారంతోపాటు భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పేదలు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తోందని, ఇప్పటికే సుమారు 90 శాతం ఇళ్లను అర్హులైన పేదలకు కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా 15 రోజుల్లోగా అర్హులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పటికే సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యతపై సమస్యలు ఎదురవుతున్నాయని, భవిష్యత్తులో ఇతర ప్రాజెక్టుల్లోనూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రెండో పంట సాగుకు అవసరమైన నీరు, విద్యుత్‌ను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ నీటి లభ్యత ప్రధాన సమస్యగా మారే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను అర్థం చేసుకుని తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండో పంట సాగుకు వెళ్లకుండా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి కొరతపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నామని, ఈ అంశాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

గుడిసెలు లేని మెదక్ నిర్మాణమే లక్ష్యం.. ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు: ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



మెదక్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ నియోజకవర్గంలో గుడిసెలు లేని సమాజాన్ని నిర్మించి, ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు కృషి చేస్తానని, ఒక్క గుడిసె కూడా మిగలకుండా చర్యలు చేపట్టడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఇల్లు ప్రతి కుటుంబానికి భరోసా, ఆత్మగౌరవం, భద్రతను అందించడంతోపాటు ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుందని అన్నారు. గుడిసెలు లేని మెదక్ నిర్మాణంతోపాటు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. "గుడిసెలు లేని మెదక్.. అభివృద్ధిలో అగ్రగామి మెదక్" అనే స్వప్నం సాకారం అయ్యే వరకు తన ప్రయత్నాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి.. నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నిజాంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మొక్కను అందజేసి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని ఎస్పీ పరిశీలించారు. కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ (CCTNS), ఈ-సాక్ష్య అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, షీ టీమ్స్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు (VPOలు) ప్రతి గ్రామాన్ని సందర్శించి డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కళాబృందాల సహకారంతో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. విధుల నిర్వహణలో అవినీతికి పాల్పడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నర్సాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు





నర్సాపూర్, అక్టోబర్ 28(సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ శివారులో అక్టోబర్ 25వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలిప్‌చెడ్ మండలం సమ్లా తండాకు చెందిన మాలోత్ వినోద్ (23) మృతి చెందగా, బానోత్ సర్దార్ (30) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వినోద్ తన స్నేహితుడు సర్దార్‌తో కలిసి ఫోటో ఆల్బమ్ అందించేందుకు ద్విచక్ర వాహనంపై నర్సాపూర్‌కు బయలుదేరాడు. రాత్రి సుమారు 11:10 గంటల సమయంలో పెద్దచింతకుంట గ్రామ శివారులోని జల హనుమాన్ చికెన్ షాప్ సమీపంలో మెదక్ నుంచి హైదరాబాద్ వైపు ఇనుప రాడ్ల లోడుతో వెళ్తున్న లారీ వెనుక భాగాన్ని వారి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తలతో పాటు శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సర్దార్ కూడా గాయపడటంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా వినోద్ మృతి చెందాడు. సర్దార్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మాలోత్ వాసురాం ఇచ్చిన ఫిర్యాదులో లారీలోని ఇనుప రాడ్లు వెనుకవైపు నుంచి బయటకు పొడుచుకొని ఉండటంతో పాటు, డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ పిండి అంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న వాసురాంకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడైన వినోద్ మృతితో సమ్లా తండాలో విషాదం నెలకొంది. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు.. మహర్షి చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్): సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించగా, పోలీసు అధికారులు, సిబ్బంది కూడా మహర్షికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవితం, ఆదర్శాలు, సమాజానికి ఆయన అందించిన విలువైన సందేశాలను స్మరించుకున్నారు. మహర్షి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, ధర్మం, సత్యనిష్ఠకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీ నరసింహ చారి, ఇన్స్పెక్టర్లు రామారావు, శివకుమార్, రాజశేఖర్, నాగేశ్వరరావు, వెంకటయ్య, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలి.. పక్కా ఇళ్ల నిర్మాణమే లక్ష్యం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. నార్సింగి మండలంలోని రైతు వేదికలో నాలుగు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడంతో పాటు మహిళల సంక్షేమం, ఆహార భద్రత, సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం చిన్న శంకరంపేట మండలంలోని రాదేశాం ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.











మర్వేల్లిలో ఘనంగా తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బస్వరాజు జన్మదిన వేడుకలు

వట్పల్లి, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మర్వేల్లి గ్రామంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ బసవరాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని పలువురు ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టి. సంగమేశ్వర్, సిరి సంపద రిపోర్టర్ రవీందర్, మేతరి శ్రావణ్ కుమార్, సోను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన జోగిపేట ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని



అందోల్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జోగిపేట పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వి. మణిప్రియ కబడ్డీలో ప్రతిభ చాటి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. సంగారెడ్డిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మణిప్రియ జిల్లా కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంతో పాటు రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్టులోనూ చోటు దక్కించుకుంది. పాఠశాలలో 'డ్రీమ్-ప్లే-అచీవ్' నినాదంతో అందిస్తున్న క్రీడా శిక్షణ, నిరంతర సాధనతోనే ఈ ఘనత సాధ్యమైందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పర్వీన్, ప్రిన్సిపాల్ విజిత, పీఈటీ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం మణిప్రియను అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

మర్వేల్లిలో మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు కు ఘనంగా జన్మదిన సన్మానం

వట్పల్లి, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మర్వేల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ శివచరణ్ ఆధ్వర్యంలో మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పంచలింగేశ్వర మహాదేవుని ఆలయం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బస్వరాజు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజు పటేల్, పరమేశ్వర్ పటేల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ దివాకర్ టీఎస్

ఖమ్మం, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, భారీ వర్షాలు కురిసే సందర్భాల్లో పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని ఆదేశించారు. సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు (సీడీపీఓలు) అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తుఫాను నేపథ్యంలో జిల్లా అధికారులు, సిబ్బందికి మంజూరు చేసిన సెలవులను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ విధులకు హాజరై తమ హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా కేంద్రాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈదురుగాలుల సమయంలో చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద నిలబడరాదని, పాతబడిన గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదని హెచ్చరించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు.



ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్) జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వివరాలు కోరినప్పుడు వెంటనే అందించేందుకు అవసరమైన రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను భద్రపరచాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పనులను మూడు నుంచి నాలుగు రోజుల్లో, ఈ వారం చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని, అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, ఆధారాలను పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఫారం-6, ఫారం-7 దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్ఓ, ఏఎల్ఓ, ఈఆర్ఓ, బీఎల్ఓ స్థాయిల్లో భౌతిక, ఆన్‌లైన్ రికార్డులను భద్రంగా నిర్వహించాలని, భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు లేదా ఆర్‌టీఐ దరఖాస్తులు వచ్చినప్పుడు అవసరమైన సమాచారం, ఆధారాలను వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ నోటీసుల విచారణను వేగవంతం చేసి ప్రతి దరఖాస్తుకు సంబంధించిన వివరాలు, ఆధారాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసీల్దార్లు సాయి గౌడ్, రాజేందర్ తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కుసంగిలో విద్యార్థులకు షూస్, విద్యా సామగ్రి పంపిణీ



టేక్మాల్, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ షూస్, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్యార్థుల అభ్యున్నతికి అవసరమైన సదుపాయాలు కల్పించడం ముఖ్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోగిపేటలో నూకల దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు.. ఐదుగురు నిందితుల అరెస్ట్



జోగిపేట, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జోగిపేట పట్టణంలో దుకాణం వెనుక గోడకు రంధ్రం చేసి నూకల బస్తాలను దొంగిలించిన కేసును పోలీసులు ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి దొంగిలించిన 39 బస్తాల నూకలతో పాటు నేరానికి ఉపయోగించిన గడ్డపారను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన బచ్చు ఆనంద్ ఈ నెల 19వ తేదీ రాత్రి సుమారు 7 గంటలకు తన దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 10 గంటలకు దుకాణం తెరిచి చూడగా, వెనుక గోడకు పెద్ద రంధ్రం కనిపించడంతో పాటు నిల్వ ఉంచిన సుమారు 39 బస్తాల నూకలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, క్రైమ్ నంబర్ 242/2026 కింద భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 331(4), 305 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 27న జోగిపేట మార్కెట్ యార్డు సమీపంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు అనుమానాస్పదంగా బియ్యం, నూకల బస్తాలను తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు దుకాణంలో దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో దాచిపెట్టిన నూకల బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో జోగిపేటకు చెందిన అలకుంట గోపాల్, మక్కల యాదయ్య, మక్కల శ్రీను, మక్కల నవీన్, అలకుంట అశోక్ ఉన్నారు. ఈ కేసులో తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.



సీఎంఆర్ బకాయిలను సన్న బియ్యం రూపంలో చెల్లించాలి: అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సీఎంఆర్ బకాయిల చెల్లింపులు, పెండింగ్ బియ్యం డెలివరీల విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రైస్ మిల్లుల యాజమాన్యాలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేఎంఎస్ 2014-15 నుంచి ఖరీఫ్ 2024-25 వరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలను, రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యాన్ని మినహాయించి, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సన్న బియ్యం రూపంలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. బియ్యానికి బదులుగా ధాన్యం విలువకు సమానమైన మొత్తాన్ని చెల్లించే సందర్భంలో నిర్దేశించిన 125 శాతం మొత్తంతో పాటు ఒప్పందం ప్రకారం 12 శాతం వడ్డీ, పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రబీ 2022-23 సీజన్‌లో వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలని, ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న 45 రోజుల గడువులోగా బకాయిలను పరిష్కరించుకోవాలని సూచించారు. రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్ బియ్యంతో పాటు కేఎంఎస్ 2025-26 ఖరీఫ్, రబీ సీజన్ల బియ్యాన్ని నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఒప్పంద నిబంధనలు పాటించకుండా బకాయిలు చెల్లించని, పెండింగ్ బియ్యం డెలివరీలను గడువులోగా పూర్తి చేయని మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే చేపట్టిన లేదా చేపట్టనున్న చర్యలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందం, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్, ఇతర అధికారులు, జిల్లా రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వనరుల వృథాను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కార్యాలయాల్లో అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని, నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, ఇప్పటి నుంచే పొదుపు చర్యలు పాటిస్తే భవిష్యత్తు తరాలకు అవసరమైన వనరులను కాపాడగలమని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వనరుల వినియోగంపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల హాజరు నమోదుకు రూపొందించిన నూతన 'మీ ప్రమాణం' యాప్‌లో ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల హాజరు నమోదును సంబంధిత శాఖల జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, వచ్చే శనివారం లోగా ఉద్యోగులందరూ యాప్‌లో నమోదు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పెండింగ్ ఎస్ఐఆర్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ పనులపై సమీక్షించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వారి అర్హతలను నిర్ధారించాలని తెలిపారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల విషయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, సంబంధిత ఆధారాలు, పూర్తి వివరాలను రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల వివరాలను మరోసారి పునఃపరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిబంధనల అమలు, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

బాలల భద్రత, హక్కులపై విద్యార్థులకు న్యాయ అవగాహన



సంగారెడ్డి, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: బాలల భద్రత, హక్కులు, రక్షణ, సంక్షేమంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి కె. జయంతి సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, మూడవ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి మాధవి కృష్ణ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సదాశివపేటలోని ప్రభుత్వ రవీంద్ర మోడల్ పాఠశాల, ప్రభుత్వ న్యూ హైస్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి సంగారెడ్డిలోని బీవీఎం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, బాలల హక్కులు, రక్షణ చర్యల గురించి వివరించారు. బాలలపై లైంగిక వేధింపుల నివారణ, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ఆన్‌లైన్ భద్రత, బాలల అక్రమ రవాణా, దోపిడీ వంటి నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అసురక్షిత పరిస్థితి ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు లేదా బాలల రక్షణ అధికారులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు. బాలల భద్రత విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని న్యాయమూర్తులు పేర్కొన్నారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి బాలుడు, బాలిక భద్రతతో జీవిస్తూ, స్వేచ్ఛగా విద్యను అభ్యసించి, గౌరవప్రదమైన వాతావరణంలో ఎదిగే హక్కు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, వారిపై జరిగే నేరాల నివారణ, సురక్షిత బాల్యాన్ని ప్రోత్సహించే దిశగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తుందని వెల్లడించారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల మేరకు పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనవసర జాప్యం లేకుండా బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 ఫిర్యాదులు అందాయి. వీటిలో సంగారెడ్డి డివిజన్ నుంచి 9, నారాయణఖేడ్ డివిజన్ నుంచి 2, జహీరాబాద్ డివిజన్ నుంచి 3, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 35 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందోల్ డివిజన్ నుంచి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: లింగాల కమల్ రాజు





ఖమ్మం, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్): చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు నాగులవంచ గ్రామానికి కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడటంతో 21 మంది గాయపడ్డారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్ రాజు పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన కూలీలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, గాయపడిన కూలీలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మాజీ జిల్లా కమిటీ సభ్యుడు మంకెన రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గురజాల హనుమంతరావు, మండల మాజీ కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, నాయకులు గడ్డం శ్రీనివాసరావు, బండి రామారావు, పిన్నెల్లి శ్రీనివాసరావు, తిమ్మినేనిపాలెం సర్పంచ్ కొమ్ము ప్రభు, మదార్ సాహెబ్, నాదెండ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



కోదాడ, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ కోఆర్డినేటర్ సురేష్ రాజ్): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తూ కోదాడ సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం (అక్టోబర్ 27) కోదాడ డీఎస్పీ కార్యాలయంలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం బృహత్తర రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి జరిగిన ఈ శిబిరంలో స్థానిక యువత, ప్రజలు, పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. తలసేమియా చిన్నారులకు రక్తం ఎంతో అవసరమని, రక్తదానం ద్వారా వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నిర్వాహకులు సూచించారు. సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలను పోలీసు అధికారులు, నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. రక్తదానం ద్వారా చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని వారు పేర్కొన్నారు.

ప్రతి భూ యజమానికి 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య: మంత్రి పొంగులేటి



సంగారెడ్డి, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలో భూ సమస్యలకు పరిష్కారం చూపడం, భూ యజమానుల హక్కులను పరిరక్షించడం, భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. భూములకు సంబంధించిన పూర్తి వివరాలను మరింత స్పష్టంగా అందుబాటులో ఉంచేందుకు ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే చేపట్టి, భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలపై స్పష్టత తీసుకురానున్నట్లు తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం మంత్రి మాట్లాడారు. గతంలో ధరణి విధానంలో ఎదురైన సమస్యలను పరిష్కరించడంతోపాటు భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా మార్చేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డులకు సంబంధించి ఎలాంటి గందరగోళం లేకుండా చూడటమే రీ సర్వే ప్రధాన ఉద్దేశమని, దీని ద్వారా భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పించవచ్చని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇప్పటికే ఏడు ఉమ్మడి జిల్లాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎనిమిదో సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పేదలు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజల హక్కులను పరిరక్షించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా గృహ నిర్మాణ శాఖ పనితీరుపై స్పందిస్తూ గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే సుమారు 90 శాతం ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల కేటాయింపులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్లను కూడా 15 రోజుల్లోగా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఇప్పటికే సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యతకు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయని, భవిష్యత్తులో ఇతర ప్రాజెక్టుల్లోనూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రెండో పంట సాగుకు అవసరమైన నీరు, విద్యుత్ సమకూర్చడం సవాలుగా మారే పరిస్థితులు ఉన్నందున రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై పునరాలోచించాలని, నీటి వనరుల పరిరక్షణలో ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి కొరతకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను ప్రజలకు, రైతులకు వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులు అందించి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ అంశాలపై చర్చించేందుకు మరుసటి రోజు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూ హక్కుల పరిరక్షణ, పారదర్శకమైన భూ రికార్డుల నిర్వహణ, పేదలకు గృహ వసతి, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో చాటేలా గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలి

హైదరాబాద్, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో మరింత పెంచేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరగడంతోపాటు వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమ్మిట్‌కు హాజరయ్యే వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, ఔత్సాహిక పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ మొదటి వారంలోగా సమ్మిట్‌కు సంబంధించిన సమగ్ర ప్రణాళికలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే ప్రధాన కార్యక్రమాలు, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ వంటి కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో సాంకేతిక పరిజ్ఞానం, ఔషధ పరిశ్రమలు, ఏరోస్పేస్ తదితర రంగాల్లో సాధించిన విజయాలను అంతర్జాతీయ అతిథులకు పరిచయం చేసేలా హైదరాబాద్ నగరవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఇందుకోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలతోపాటు డ్రోన్ల ఆధారిత ప్రచారాన్ని కూడా నిర్వహించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ప్రపంచాన్ని ప్రభావితం చేయనున్న క్లైమేట్ చేంజ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులను సమ్మిట్‌కు ఆహ్వానించాలని తెలిపారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ఈ రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారులకు వివరించేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వం ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ శిల్పకళా విశిష్టతలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని అంతర్జాతీయ అతిథులకు పరిచయం చేసేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణ మహిళల సాంస్కృతిక జీవనానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ గురించి విదేశీ అతిథులు తెలుసుకునేలా ప్రత్యేక డిజైన్లు, ప్రదర్శనలు, ఇతర ఏర్పాట్లపై అధికారులు వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతి, సాంస్కృతిక వారసత్వాన్ని ఒకే వేదికపై ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్‌ను నిర్వహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ డి. అనుదీప్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు శిక్షణ కార్యక్రమం

సందేశం టైమ్స్ ప్రతినిధి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాధవరెడ్డి, జిల్లా కార్యదర్శి, కోశాధికారి సుందర్ రావు, తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి, కమిషనర్ అంజా గౌడ్, ట్రైనింగ్ కమిషనర్ చంద్రశేఖర్ నిర్మల్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన స్కౌట్ గౌడ్, లింగంపల్లి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు నిర్వహిస్తున్న శిక్షణ ప్రిన్సిపాల్ సురభి చైతన్య, గైడ్ విభాగం స్టాఫ్ సభ్యులు కార్యక్రమంలో ఆయా జిల్లాల నుంచి శిక్షణార్థులు ధనలక్ష్మి, సుజాత, ప్రమీల పాల్గొన్నారు. ఈ శిక్షణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ కార్యక్రమాన్ని జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ సునీత మోహన్ రావు, కోర్సు లీడర్ ఎం. గిరిజాదేవి, స్టాఫ్ ఖన్నా సందర్శించి కార్యక్రమం నిర్వహణను సభ్యులు అమరజ్యోతి, సోలోమన్, కార్యదర్శి పరిశీలించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి విజయానికి కృషి చేయాలి: కాంగ్రెస్ నాయకుల పిలుపు



చింతకాని, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మధిర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ పొట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన నూతి సత్యనారాయణ గౌడ్, పొట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు గడువు ఉన్నందున అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను గుర్తించి ఓటరుగా నమోదు చేయించేలా నాయకులు చొరవ చూపాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియపై అర్హులకు అవగాహన కల్పించి, గడువులోగా నమోదు పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మట్కేపల్లి ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, తెల్లబల్ల సాయి జల్లావత్, మణిపాల, మడిపల్లి భాస్కర్, గంగరాజు, ఎస్.కె. అబ్దుల్, బండెల నాగరాజు, యడ్లపల్లి శ్రీనివాసరావు, ఓర్స్ వీరభద్రం, జోనల్ ఇన్‌చార్జిలు, పలువురు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ అమలు చేయాలి

సూర్యాపేట, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సూర్యాపేట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం సాయంత్రం శంకర్ విలాస్‌లోని నీటిపారుదల శాఖ భవనంలో జిల్లా అధ్యక్షుడు ఎన్. భూపాల్ రెడ్డి, కార్యదర్శి భూక్య పాండు నాయక్ ప్రారంభంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంఘం కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. తెలంగాణ ఉద్యోగుల పీఆర్సీ నివేదికను తెప్పించి 42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2027 సంవత్సరానికి సంబంధించిన వాల్ క్యాలెండర్లు, టేబుల్ క్యాలెండర్లు, డైరీల తయారీ ప్రక్రియను ప్రారంభించి, ప్రకటనల సేకరణతో పాటు అన్ని ప్రచురణలు ఒకే నమూనాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. 2026 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నవంబర్‌లోగా పూర్తిచేయాలని తీర్మానించారు. ప్రభుత్వం, ఉద్యోగుల వాటాలను సమాన నిష్పత్తిలో నిర్ధారించి ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) విధివిధానాలను పూర్తిస్థాయిలో వెంటనే అమలు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరారు. 2025 జనవరి 1, జూలై 1, 2026 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న మూడు విడతల కరువు భత్యాన్ని (డీఏ) వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు. జిల్లా కార్యవర్గంలో ఖాళీ అయిన స్థానాలు, బదిలీల కారణంగా ఏర్పడిన ఖాళీల భర్తీకి డి. లింగా నాయక్, డి. మల్లేశంలను ఉపాధ్యక్షులుగా, వి. రెబకను పబ్లిక్ సెక్రటరీగా ఎన్నుకోవడాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంఘం ఐక్యంగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

పనితీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవు



సంగారెడ్డి, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు తమ పనితీరులో మార్పు తీసుకురాకపోతే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించినప్పుడే రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో కలిసి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని తెలిపారు. రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, రైతులకు వారి భూములపై పూర్తి స్పష్టత కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లతో నేరుగా మాట్లాడిన మంత్రి, సర్వేకు కేటాయించిన గ్రామాలు, ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, రోజువారీగా సర్వే చేస్తున్న భూమి విస్తీర్ణం, సర్వే పూర్తి చేయడానికి పట్టే సమయం తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో రైతులకు వారి భూముల విస్తీర్ణం, సరిహద్దులపై స్పష్టమైన సమాచారం అందించాలని, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి సందేహాలు తలెత్తకుండా వివరించాలని సూచించారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి స్థాయిలోని రెవెన్యూ అధికారులు సర్వే పనులను నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించడంతోపాటు రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, ఆయా గ్రామాల్లో జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు విస్తృతంగా పర్యటించి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇదే సమీక్షలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసే ప్రక్రియ విడతలవారీగా కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగును రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటిస్తూ అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించిన మంత్రి, వాటి పరిష్కారానికి సంబంధిత జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేశారు. ప్రజాప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, ఎంపీలు రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాలో 28 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

సూర్యాపేట, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కార్యక్రమం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్న 28 మెడికల్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులకు సంబంధించి ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు తమ అభ్యంతరాలను అక్టోబర్ 28, 2026లోపు సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను అన్ని పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యాపేట ఐడీఓసీలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, ఎఫ్-25లో అందజేయాలని పేర్కొన్నారు. మెరిట్ జాబితా, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు సూర్యాపేట జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



మర్వేల్లిలో ఘనంగా పంచలింగేశ్వర మహాదేవుని 9వ వార్షికోత్సవ మహోత్సవం

వట్పల్లి, అక్టోబర్ 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వేల్లి గ్రామంలో శ్రీ పంచలింగేశ్వర మహాదేవుని 9వ వార్షికోత్సవ మహోత్సవాన్ని చిన్నపట్ల మల్లేశ్వరమ్మ, సంగమేశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పంచలింగేశ్వర మహాదేవుని కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవంలో గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులు వరి కోతలు వాయిదా వేసుకోండి



సూర్యాపేట, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు మరో మూడు రోజులపాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. వర్షాలకు కోసిన వరి ధాన్యం తడిస్తే తేమ శాతం పెరిగి నాణ్యత దెబ్బతినడంతోపాటు రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు వరి కోతలు చేపట్టవద్దని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యం వర్షానికి తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశాల్లో నిల్వ ఉంచి, టార్పాలిన్లు లేదా ఇతర కవర్లతో పూర్తిగా కప్పి భద్రపరచాలని తెలిపారు. వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవడం ద్వారా పంట నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంటలను వర్షాల నుంచి కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారని కలెక్టర్ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ సంబంధిత సూచనలపై విస్తృతంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు. రైతులు వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ముందస్తు జాగ్రత్తలతో ధాన్యం నష్టాన్ని నివారించుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.

రాశి ఫలాలు

ఈరోజు రాశిఫలాలు: అక్టోబర్ 28, 2026 బుధవారం

మేషం: ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యమైన పనుల్లో జాప్యం ఎదురుకావచ్చు. వృత్తి, ఉద్యోగాల్లో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాల్లో స్వల్ప లాభాలు అందుతాయి. దూర ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవడం మంచిది. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చకపోవచ్చు.

వృషభం: సంతానం ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరచవచ్చు. ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు నెమ్మదిగా సాగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాల్లో సాధారణ పరిస్థితులు ఉంటాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొత్త రుణాల కోసం ప్రయత్నించాల్సి రావచ్చు. ప్రయాణాల్లో వాహన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

మిథునం: వ్యాపార, ఉద్యోగ రంగాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. జీవిత భాగస్వామితో సఖ్యత పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు సానుకూల ఫలితాలనిస్తాయి. భూ సంబంధిత క్రయవిక్రయాల్లో లాభాలు పొందుతారు. సమాజంలో ప్రముఖుల ఆదరణ లభిస్తుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నాయి.

కర్కాటకం: ఆర్థిక వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ముఖ్యమైన పనుల్లో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో ఆశించిన పురోగతి ఉంటుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమయ్యే సూచనలు ఉన్నాయి. చేపట్టిన పనులను నిజాయితీగా పూర్తి చేస్తారు. స్నేహితులతో విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సింహం: కుటుంబ సభ్యుల నుంచి ఊహించని మాటలు వినాల్సి రావచ్చు. చేపట్టిన పనులు నెమ్మదిగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. దీర్ఘకాలిక రుణాల ఒత్తిడి పెరగవచ్చు. వృత్తి, వ్యాపారాల్లో సొంత నిర్ణయాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చు.

కన్య: ఉద్యోగస్తులకు అధికారుల నుంచి కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. ఆర్థిక వ్యవహారాలు సాధారణంగా సాగుతాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం మంచిది. అనవసర ప్రయాణాలు చేయాల్సి రావచ్చు. కుటుంబ వాతావరణంలో కొంత గందరగోళం ఏర్పడవచ్చు. వృత్తి, వ్యాపారాల్లో మందగమనం కనిపిస్తుంది.

తుల: నిరుద్యోగులకు కొత్త ఉద్యోగ అవకాశాలు లభించే సూచనలు ఉన్నాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలోని ప్రముఖులతో పరిచయాలు విస్తరిస్తాయి. ఉద్యోగస్తులకు అధికారులతో ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయి. ఆత్మీయుల నుంచి ప్రత్యేక ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు.

వృశ్చికం: ఇంట్లో జరిగే కొన్ని సంఘటనలు ఆశ్చర్యానికి గురిచేయవచ్చు. చిన్ననాటి మిత్రులతో అభిప్రాయ భేదాలు ఏర్పడే అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాలు నెమ్మదిగా సాగుతాయి. ఉద్యోగస్తులు ఇతరుల విమర్శలను ఎదుర్కోవచ్చు. కుటుంబ విషయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తారు.

ధనుస్సు: విలువైన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. చాలాకాలంగా పూర్తికాని పనులు స్వల్ప ప్రయత్నంతో పూర్తవుతాయి. రావాల్సిన డబ్బు సకాలంలో అందుతుంది. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో అంచనాలకు అనుగుణంగా ఫలితాలు ఉంటాయి. నిరుద్యోగులకు కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యాల్లో పాల్గొంటారు.

మకరం: సంతానం విద్యకు సంబంధించిన విషయాలు కొంత నిరుత్సాహపరచవచ్చు. కుటుంబ సభ్యులతో అభిప్రాయ భేదాలు ఏర్పడే అవకాశం ఉంది. వృత్తి, ఉద్యోగాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకోవచ్చు. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కంటి సంబంధిత ఆరోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగించవచ్చు.

కుంభం: చిన్ననాటి మిత్రులతో విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతానం వివాహ విషయంపై కుటుంబంలో చర్చ జరుగుతుంది. ఇంటా బయటా మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. ఉద్యోగాల్లో పదోన్నతులు లభించే సూచనలు ఉన్నాయి.

మీనం: చేపట్టిన పనుల్లో ప్రయత్నాలకు తగిన ఫలితాలు లభిస్తాయి. నిరుద్యోగులకు కొత్త అవకాశాలు అందుతాయి. వ్యాపారాల్లో భాగస్వాముల నుంచి ఆశించిన సహకారం లభిస్తుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి గతంతో పోలిస్తే మెరుగుపడుతుంది. స్నేహితులతో ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయి.

తెలంగాణలో 365 మండలాలు కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటన



111 మండలాల్లో తీవ్ర కరువు.. 254 మండలాల్లో మధ్యస్థ కరువు – రైతులకు పెట్టుబడి రాయితీ, తాగునీరు, పశుగ్రాసం అందించాలని ప్రభుత్వ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో 2026 ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సుదీర్ఘ వర్ష విరామాలు, పంటల సాగు విస్తీర్ణం తగ్గడం, జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోవడం వంటి పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో ఉన్న 365 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించింది. వీటిలో 111 మండలాలను తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా, మరో 254 మండలాలను మధ్యస్థ కరువు ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించింది. ఈ మేరకు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ–II) శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 03ను 2026 అక్టోబర్ 24న జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులను జారీ చేయగా, 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరువు ప్రభావిత మండలాల గుర్తింపునకు జాతీయ కరువు నిర్వహణ మార్గదర్శకాలు–2016, డిసెంబర్ 2020 వరకు నవీకరించిన నిబంధనలు, జిల్లా కలెక్టర్లు సమర్పించిన ప్రతిపాదనలు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు, వివిధ సాంకేతిక విభాగాల విశ్లేషణలు, మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రకటన వెలువడటంతో ఆయా మండలాల్లో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఏర్పడింది.

వర్షపాతంలో 17 శాతం లోటు.. తగ్గిన పంటల సాగు విస్తీర్ణం: రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30, 2026 వరకు నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, వాస్తవంగా 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 17 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 18 జిల్లాలు వర్షపాత లోటును ఎదుర్కొన్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్షాభావం ప్రభావం వ్యవసాయ రంగంపై స్పష్టంగా కనిపించింది. సాధారణంగా 139.28 లక్షల ఎకరాల్లో ఉండాల్సిన ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. ముఖ్యంగా వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. అంటే వరి సాగు విస్తీర్ణంలో సుమారు 18 శాతం తగ్గుదల నమోదైంది. పంటల సాగుకు అవసరమైన సమయంలో తగినంత వర్షం కురవకపోవడం, పలు ప్రాంతాల్లో దీర్ఘకాలిక వర్ష విరామాలు ఏర్పడటం, భూమిలో తేమ తగ్గిపోవడం వంటి కారణాలు వ్యవసాయ కార్యకలాపాలపై ప్రభావం చూపాయి. మరోవైపు ఎల్‌నినో పరిస్థితులు బలపడటం, బంగాళాఖాతంలో అల్పపీడన వ్యవస్థలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపకపోవడం, వర్షాల మధ్య ఎక్కువ విరామాలు ఏర్పడటం కూడా కరువు పరిస్థితులు తీవ్రం కావడానికి కారణాలుగా ప్రభుత్వ పరిశీలనలో వెల్లడయ్యాయి.

జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు.. తాగునీరు, సాగునీటిపై ఆందోళన: రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో మొత్తం సామర్థ్యం 585 టీఎంసీలు ఉండగా, ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న సమయానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు 179.63 టీఎంసీలుగా నమోదయ్యాయి. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం వల్ల రాబోయే కాలంలో తాగునీటి సరఫరా, వ్యవసాయ అవసరాలు, పశువులకు నీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి వంటి రంగాలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం గుర్తించింది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం, అవసరమైన ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించడం అత్యవసరమని స్పష్టం చేసింది. కరువు ప్రభావం కేవలం పంటలకే పరిమితం కాకుండా గ్రామీణ జీవనోపాధి, పశుసంపద, వ్యవసాయ కూలీల ఉపాధి, కుటుంబాల ఆదాయంపై కూడా పడే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

శాస్త్రీయ ప్రమాణాలతో కరువు అంచనా: కరువు ప్రభావిత మండలాలను గుర్తించేందుకు ప్రభుత్వం కేవలం వర్షపాత గణాంకాలనే ఆధారంగా తీసుకోలేదు. జాతీయ కరువు నిర్వహణ మార్గదర్శకాల్లో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా వర్షపాతం, వర్ష విరామాలు, పంటల సాగు విస్తీర్ణం, వృక్ష సంపద పరిస్థితి, నేలలో తేమ, భూగర్భ జలాల స్థితి, క్షేత్రస్థాయి పరిశీలనలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నమోదైన ఆటోమేటెడ్ వర్షపాత గణాంకాలు, టెలిమెట్రీ సమాచారం, వర్ష విరామాల వివరాలను మొదటి దశ అంచనాకు ఉపయోగించారు. అనంతరం వ్యవసాయ శాఖ అందించిన పంటల సాగు విస్తీర్ణ లోటు వివరాలు, తెలంగాణ రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (TGRAC) అందించిన వృక్ష సంపద పరిస్థితి సూచిక, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTSAU) అందించిన నేల తేమ సంబంధిత సూచిక, భూగర్భ జలాల శాఖ అందించిన హైడ్రాలజీ ఆధారిత కరువు సూచికలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం నాలుగు రకాల ప్రభావ సూచికల్లో కనీసం మూడింటిని పరిగణనలోకి తీసుకున్నారు. నీటిపారుదల సౌకర్యం ఉన్న మండలాల్లో వర్తించే ప్రత్యేక మార్గదర్శకాలను కూడా అనుసరించారు. ప్రతి మండలంలోని 10 శాతం గ్రామాల్లో నమూనా క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించి, వాటి ఫలితాలను కరువు తీవ్రతను నిర్ధారించడానికి తుది ప్రాతిపదికగా తీసుకున్నారు. జిల్లా కలెక్టర్లు సమర్పించిన ప్రతిపాదనలు, క్షేత్రస్థాయి నివేదికలు, సంబంధిత శాఖల సాంకేతిక విశ్లేషణలను పరిశీలించిన అనంతరం 2026 అక్టోబర్ 23న జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షకు ఈ ప్రతిపాదనలను సమర్పించారు. అనంతరం 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తీవ్ర కరువు, మధ్యస్థ కరువు వర్గీకరణ: ప్రభుత్వ ఉత్తర్వుల అనుబంధం–2లో మండలాల వారీగా కరువు తీవ్రతను పేర్కొన్నారు. మొత్తం 365 మండలాల్లో 111 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా, 254 మండలాలు మధ్యస్థ కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. ఈ వర్గీకరణ ఆధారంగా కరువు తీవ్రతకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఏ మండలానికి ఏ వర్గీకరణ వర్తిస్తుందనే విషయాన్ని అనుబంధం–2లో స్పష్టంగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు ఈ జాబితాను సంబంధిత జిల్లా గెజిట్‌లో ప్రచురించి అధికారికంగా తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రకటనలో పేర్కొనని మిగిలిన మండలాల పరిస్థితులను కూడా రాష్ట్ర కరువు పర్యవేక్షణ విభాగం నిరంతరం పరిశీలిస్తుంది. పరిస్థితులు మారి కరువు ప్రభావం పెరిగినట్లు తేలితే అదనపు ప్రకటన ద్వారా మరిన్ని మండలాలను జాబితాలో చేర్చే అవకాశం ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రైతులకు పెట్టుబడి రాయితీ.. నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ: కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం ఎదుర్కొన్న రైతులకు నిబంధనల ప్రకారం వ్యవసాయ పెట్టుబడి రాయితీ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ సహాయాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (DBT) విధానం ద్వారా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (NDRF) కింద సహాయం అందిన తేదీ నుంచి ఒక నెలలోపు అర్హులైన రైతులకు వ్యవసాయ పెట్టుబడి రాయితీ పంపిణీ చేయాలని వ్యవసాయ, సహకార శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సహాయం పొందే రైతుల జాబితాలను సంబంధిత జిల్లా కలెక్టర్ల అధికారిక వెబ్‌సైట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కూడా ప్రచురించాలని పేర్కొంది. దీనివల్ల అర్హులైన లబ్ధిదారుల వివరాలు పారదర్శకంగా అందుబాటులో ఉండటంతోపాటు సహాయం పంపిణీని పర్యవేక్షించడానికి వీలవుతుంది. అయితే ప్రతి రైతుకు అందే రాయితీ మొత్తం ఎంత, ఏ పంటకు ఎంత సహాయం వర్తిస్తుంది, ఏయే నిబంధనల ప్రకారం అర్హత నిర్ణయిస్తారు అనే వివరాలు ఈ ఉత్తర్వులో పేర్కొనలేదు. కాబట్టి రైతులు తమకు వర్తించే సహాయం మొత్తంపై తదుపరి ప్రభుత్వ మార్గదర్శకాలను గమనించాల్సి ఉంటుంది.

తాగునీరు, పశుగ్రాసం, పశువుల శిబిరాలపై ప్రత్యేక దృష్టి: కరువు ప్రభావిత మండలాల్లో ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన చోట తాగునీటి సరఫరాను పెంచడం, ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించడం, అత్యవసర పరిస్థితుల్లో నీటిని అందించే ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు చేపట్టాలి. పశువులకు తగినంత పశుగ్రాసం అందుబాటులో ఉండేలా చూడటంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో పశువుల శిబిరాలను ఏర్పాటు చేయాలి. నీటి కొరత కారణంగా పశుసంపదకు నష్టం కలగకుండా పశువుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యవసాయం, పశుసంవర్ధక శాఖలు స్థానిక పరిస్థితులను అంచనా వేసి తక్షణ అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. కరువు పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగితే గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

గ్రామీణ ఉపాధికి ఊతం.. వ్యవసాయ రుణాలపై కీలక ఆదేశాలు: కరువు కారణంగా వ్యవసాయ పనులు తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు దెబ్బతినకుండా ఉపాధి కల్పన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న VB-G RAM G కార్యక్రమం కింద నిబంధనలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను కల్పించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో పంట నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల వ్యవసాయ రుణాల విషయంలోనూ ప్రభుత్వం చర్యలు సూచించింది. జిల్లా కలెక్టర్లు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (SLBC)తో సంప్రదింపులు జరిపి, భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ వసూళ్లలో బలవంతపు చర్యలను నిలిపివేయడం వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఈ సౌకర్యాలు వర్తించే విధానం సంబంధిత బ్యాంకింగ్ నిబంధనలు, అర్హతలు, మార్గదర్శకాలపై ఆధారపడి ఉంటుంది. కరువు కారణంగా రైతులు అప్పుల ఒత్తిడికి గురికాకుండా, గ్రామీణ కుటుంబాలకు ఉపాధి లభించేలా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉత్తర్వుల సారాంశం స్పష్టం చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక సహాయం కోరనున్న రాష్ట్రం: తెలంగాణ శాసనసభ 2026 సెప్టెంబర్ 18న ఆమోదించిన తీర్మానాన్ని కూడా ప్రభుత్వ ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షపాత లోటు పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని పంపి క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను అంచనా వేయాలని, జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (NDRF) కింద సహాయం మంజూరు చేయాలని, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (SDRF)లో కేంద్రం తన వాటాను విడుదల చేయాలని శాసనసభ కోరింది. పంట నష్టానికి పరిహారం, వ్యవసాయ పెట్టుబడి రాయితీ, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, భూగర్భ జలాల వనరులు, నీటి వనరుల పునరుద్ధరణకు ప్రత్యేక సహాయం అందించాలని తీర్మానంలో పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి కార్యక్రమం కింద అదనంగా 50 రోజుల పని కల్పించి, దానికి సంబంధించిన పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా ఎరువుల సరఫరాను పెంచాలని, అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్‌ను అందించాలని, కరువు నివారణ, ఉపశమన చర్యల కోసం రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP)లో రాష్ట్ర రుణ పరిమితిని మూడు శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు సహాయం అందించడంతోపాటు అవసరమైన చోట నిబంధనలను సడలించాలని కూడా శాసనసభ విజ్ఞప్తి చేసింది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ప్రతిపాదనలు మాత్రమే; ఈ జీఓ ద్వారా పై మొత్తాలు లేదా సౌకర్యాలన్నీ కేంద్రం మంజూరు చేసినట్లు భావించరాదు.

కేంద్రానికి సమగ్ర నివేదిక.. సహాయ చర్యలపై నిరంతర పర్యవేక్షణ: రాష్ట్రంలో కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వ సహాయం కోరేందుకు అవసరమైన మెమోరాండం సిద్ధం చేసి రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖకు అందించాలని ప్రణాళికా శాఖను ప్రభుత్వం ఆదేశించింది. అక్కడి నుంచి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలకు సమర్పించేందుకు అవసరమైన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ డైరెక్టర్, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సమన్వయంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సహాయం పొందిన లబ్ధిదారుల వివరాలు, ఖర్చు చేసిన నిధులు, చేపట్టిన పనుల వివరాలతో ప్రత్యేక రిజిస్టర్లను నిర్వహించాలి. సహాయక చర్యల పురోగతిపై రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ నిర్దేశించిన వ్యవధుల్లో నివేదికలు సమర్పించాలి. ఈ ఉత్తర్వులకు ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించినట్లు జీఓలో పేర్కొన్నారు. అలాగే ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర గెజిట్ ప్రత్యేక సంచికలో ప్రచురించి, సంబంధిత జిల్లాల కలెక్టర్లు తమ జిల్లా గెజిట్‌లలో ఆంగ్లం, తెలుగులో నోటిఫికేషన్‌ను వెంటనే ప్రచురించాలని ఆదేశించారు.

ఆరు నెలలపాటు అమల్లో కరువు ప్రకటన: ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుంచి ఆరు నెలలపాటు కరువు ప్రభావిత మండలాల ప్రకటన అమల్లో ఉంటుంది. అయితే పరిస్థితులు మెరుగుపడితే ఆ గడువు ముగియకముందే సంబంధిత ప్రాంతాలను కరువు ప్రభావిత జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంది. అలాగే ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో లేని మండలాల్లోనూ కరువు పరిస్థితులు ఏర్పడితే రాష్ట్ర కరువు పర్యవేక్షణ విభాగం వాటిని పరిశీలించి అదనపు నోటిఫికేషన్ ద్వారా చేర్చవచ్చు. పట్టణ, మున్సిపల్ ప్రాంతాలను కరువు ప్రభావిత మండలాల ప్రకటనలో భాగంగా మినహాయించాలని, అయితే తాగునీటి సరఫరా విషయంలో వాటిని కరువు ప్రభావిత మండలాలతో సమానంగా పరిగణించాలని అనుబంధ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. దీంతో కరువు ప్రభావిత మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలతోపాటు సంబంధిత పట్టణ ప్రాంతాల్లోనూ తాగునీటి అవసరాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

మొత్తంగా, తెలంగాణలో 2026 ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించడం కీలక పరిణామంగా నిలిచింది. 111 మండలాల్లో తీవ్ర కరువు, 254 మండలాల్లో మధ్యస్థ కరువు ప్రభావం ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం రైతులకు పెట్టుబడి రాయితీ, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, పశువుల శిబిరాలు